ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ఏలూరు రూరల్: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నాలుగో రోజు కబడ్డీ పోటీలు నిర్వహించారు. యువకులు ఉత్సాహంగా తలపడ్డారు.

గ్రామ స్వరాజ్యం దిశగా సీఎం జగనన్న పాలన

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- అడవికొలను గ్రామ సచివాలయ భవనం ప్రారంభం



అడవికొలను సచివాలయం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం ఎనికేపల్లిలో రూ.43లక్షల అంచనా వ్యయంతో అడవికొలనులో నిర్మించిన గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ నిడమర్రు మండలంలో 14 సచివాలయ భవనాల్లో 12 నిర్మాణాలు పూర్తయినట్టు తెలిపారు. నియోజకవర్గంలో జనవరి నెలాఖరులోపు నూరుశాతం గ్రామ సచివాలయ నూతన భవనాలు సిబ్బందికి, ప్రజలకు అందుబాటులో రానున్నట్లు తెలిపారు. ఉంగుటూరు నియోజకవర్గంలో రూ.1,520 కోట్ల నిధులు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ఉపాధి పథకం నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ముందస్తుగా సచివాలయాల మండల కన్వీనర్ నాదు అచ్యుతరామారావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ జాయింట్ సెక్రటరీ సంకు నాగశేషు, సర్పంచ్‌లు పుప్పాల మెహర్ కుమార్, పాల వెంకన్న, ఉప సర్పంచ్ సరిపల్లి త్యాగరాజు, నీటి సంఘం అధ్యక్షుడు నిమ్మల బుజ్జి, వైఎస్సార్ సీపీ నేతలు గంథం సుభాష్, గంధం రఘు, ముత్యాల సాయి, పుప్పాల సాయి, కిలారి రవి తదితరులున్నారు.

పీఎం ఉజ్వల యోజనలో ఉచిత గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్

పెదపాడు: ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ కనెక్షన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పీఎం ఉజ్వల యోజన పథకంలో ఉచిత గ్యాస్ కనెక్షన్లను దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేసారు. అప్పనవీడు గ్రామంలో 47 గ్యాస్ కనెక్షన్లను మహిళలకు అందించారు. ఈ సందర్భంగా అప్పన ప్రసాద్ మాట్లాడుతూ పేద మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంకా గ్యాస్ కనెక్షన్లు అవసరమైతే గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సంప్రదించాలని తెలిపారు. వారికి గ్యాస్ ఏజెన్సీ ద్వారా అందించేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నాల ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి పద్మారావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పెదపాడు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదపాడు మండలలలోని కొక్కిరపాడులోని పోలింగ్ కేంద్రాలను పెదపాడు ఈఓఆర్డీ సూర్యకుమార్, పెదవేగి ఈఓఆర్డీ బీసీ శ్రీనివాసులు శనివారం తనిఖీ చేసారు. ప్రాథమిక పాఠశాలలోని 129, 130,131,132 పోలింగ్ కేంద్రాలను వారు తనిఖీ చేసి స్థానిక అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. స్థానిక పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో అజయ్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఐడియల్ యూత్ మూమెంట్ (ఐవైఎం) సంస్థ చేపట్టిన ఉద్యమ కార్యక్రమం పోస్టర్‌ను స్థానిక కార్యాలయంలో డీఎస్పీ ఇ.శ్రీనివాసులు శనివారం ఆవిష్కరించారు.









ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు విశేష స్పందన



భీమడోలు: పూళ్లలో క్రికెట్ ఆడుతున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి



దెందులూరు: కొవ్వలిలో క్రీడలను ప్రారంభించిన అధికారులు



దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీ



ఆడుదాం ఆంధ్రలో ఆటలను ప్రారంభిస్తున్న సర్పంచి మిద్దే సత్యవతి

భీమడోలు: ఆడుదాం ఆంధ్ర పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రారంభించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఐదో రోజైన శనివారం మండలంలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఆగడాలలంక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన క్రికెట్ పోటీలకు ఎక్కువ సంఖ్యలో టీములు తరలి వచ్చాయి. భీమడోలు ఉన్నత పాఠశాలలో పోలసానిపల్లికు చెందిన క్రికెట్ టీములు పోటీల్లో తలపడ్డాయి. ఆ పోటీలను సర్పంచ్ షేక్ రహీమాబేగం, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ప్రారంభించారు. గుండుగొలనులో ఆరు మ్యాచ్‌లు, భీమడోలు 15 మ్యాచ్‌లు, పూళ్లలో 10 మ్యాచ్‌లు, ఆగడాలలంకలో 2 మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీల ద్వారా మండల స్థాయిలో ఆడే క్రీడాకారులను ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఈవోఆర్డీ ఏ.సుందరి, మైనార్టీ సెల్ వైసీపీ నియోజకవర్గ నాయకులు షేక్ హసేనా, గామకార్యదర్శులు ఎస్.ఠాగూర్, సూర్య, మురళి పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడల అభివృద్ధికి దోహదం

దెందులూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడల అభివృద్ధికి దోహదం చేస్తాయని మండల ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం అన్నారు. శనివారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర పోటీలను ఎంపీడీఓ భీమరాజు, మండల కన్వీనర్ జక్కుల సురేష్ కుమార్, పాఠశాల హెచ్ఎం శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఆయన ప్రారంభించారు. కొవ్వలి సచివాలయం-1, 2 జట్లు పోటీ పడ్డాయి. ఎంఈఓలు ఎమ్ఎస్‌వీ ప్రసాద్, కే.అన్నమ్మ క్రీడాకారులను పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలియచేశారు. అన్ని సచివాలయాల్లో పోటీలు నిర్వహించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ఉంగుటూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎ.గోకవరంలో షటిల్ పోటీలను సర్పంచి మిద్దే సత్యవతి శనివారం ప్రారంభించారు. క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచి సత్యవతి మాట్లాడుతూ గ్రామాల్లోని యువతను ప్రోత్సహించేందుకు సీఎం జగన్ ఆడుదాం ఆంధ్రను ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మిద్దే వేంకటేశ్వరరావు, పార్టీ కార్యకర్తల, క్రీడాకారులు పాల్గొన్నారు.

కోలాటం ప్రదర్శనలో చిన్నారుల ప్రతిభ



ఏలూరులో కోలాటం ప్రదర్శించిన చిన్నారులను అభినందిస్తున్న అధికారులు

భీమడోలు: ఏలూరులో నిర్వహించిన హేలాపురి బాలోత్సవం 4వ పిల్లల సంబరాల్లో భాగంగా నిర్వహించిన కోలాటం నృత్య ప్రదర్శన పోటీలో అన్నేవారిగూడెం యూపీ స్కూలు విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన కోలాట నృత్య ప్రదర్శనల టీముల్లో అన్నేవారిగూడెం యూపీ పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటి జూనియర్స్ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కై వసం చేసుకున్నారు. ఏడో తరగతికి చెందిన 13 మంది కోలాట కళాకారుల బృందం ఏలూరులో నిర్వహించిన పోటీల్లో తమ ప్రదర్శన ద్వారా ఆకట్టుకున్నారు. చిన్నారులు చూపిన ప్రతిభకు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొంది విజేతగా నిలిచారు. ఏలూరులో బాలోత్సవం ముగింపు, బహుమతి ప్రదానోత్సవంలో విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలను శుక్రవారం అందించారు. శనివారం పాఠశాలలో విద్యార్థులను హెచ్ఎం షేక్ మస్తాన్ అభినందించారు. విద్యార్థులను సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, ఎంపీటీసీ పి.శ్రీనివాస్, ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, భాస్కర్, ఎస్ఎంసీ చైర్మన్ పి.మౌనిక అభినందించారు.

బొకేలు వద్దు.. పుస్తకాలే ముద్దు

గణపవరం: ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పుట్టినరోజు సందర్భంగా ఈనెల 31న శుభాకాంక్షలు తెలపడానికి వచ్చే వారు పూలదండలు, బొకేలు, శాలువాలు తీసుకురావద్దని, వాటికి బదులుగా పేద విద్యార్థులకు ఉపయోగపడేలా రాత పుస్తకాలు, పెన్నులు, జామెట్రీ బాక్సులు వంటి వాటిని తీసుకురావాలని ఎమ్మెల్యే వాసుబాబు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు అడబాల రవి, శింగులూరి సుభాష్ కోరారు. నాలుగేళ్లుగా వాసుబాబు ఇదే సంప్రదాయాన్ని పాటిస్తున్నారని, ఈఏడాది కూడా దానిని కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏటా పుట్టినరోజు, నూతన సంవత్సరం రోజున శుభాకాంక్షలు తెలియజేసిన వారు అందించిన విద్యా సామగ్రిని నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు పంపిణీ చేశామని తెలిపారు.

బలరామావతారంలో జనార్ధన స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అగ్రహారంలోని భూ, నీళా సమేత జనార్ధన స్వామి దేవస్థానంలో స్వామి వారిని శనివారం బలరామావతారంలో అలంకరించారు.



















పౌరహక్కులపై అవగాహన కల్పించాలి

గణపవరం: పౌరులంతా సమానమేనని, ప్రతి పౌరుడికి కొన్ని హక్కులు, బాధ్యతలు ఉంటాయన్న విషయాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షుడు చీకటి మిల్లి మంగరాజు కోరారు. శనివారం జాతీయ పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా గణపవరం మండలం వెంకట్రాజపురంలో పౌరహక్కుల అవగాహన సదస్సు తహసీల్దార్ పమ్మి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంగరాజు మాట్లాడుతూ కులంపేరుతో దూషించిన, దౌర్జన్యం చేసిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తారని అన్నారు. తహసీల్దార్ పమ్మి లక్ష్మి మాట్లాడుతూ ఎవరినైనా కులం పేరుతో దూషిస్తే కఠిన శిక్షలకు గురికావలసి వస్తుందని హెచ్చరించారు. సర్పంచ్ మల్లంపల్లి సురేష్, పోలీస్‌స్టేషన్ రైటర్ ప్రసాద్, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.











విద్యార్థులకు నగదు బహుమతులు

పెదపాడు: విద్యార్థులు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం నైతిక విలువలపై అవగాహన కల్పించారు. అనంతరం 6,7,8,9 తరగతుల్లో ప్రథమస్థానంలో నిలిచిన వారికి రూ.1000, ద్వితీయ సాధించిన వారికి రూ.500, పెద్ద బాల శిక్షలను బహూకరించారు. మొత్తం రూ.14,500 నగదు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీమయ్య, అధ్యక్షుడు కురెళ్ల సుభాచారి పాల్గొన్నారు.


పెదపాడు మండలంలోని కొక్కిరపాడులో కెరీర్ గైడెన్స్ అందిస్తున్న మారుబోయిన కోటేశ్వరరావు

రేషన్ వెహికల్స్ సంఘ జిల్లా అధ్యక్షుడిగా జయరాజ్ ఎన్నిక


సగ్గుర్తి జయరాజును అభినందిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

పెదవేగి : ప్రభుత్వం ద్వారా పేదలకు అందించే రేషన్ సరుకుల పంపిణీలో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని ఏలూరు జిల్లా రేషన్ వెహికల్స్ సంఘ అధ్యక్షుడు సగ్గుర్తి జయరాజు అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న రేషన్ వెహికల్స్ నిర్వాహకులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏలూరు జిల్లా నూతన అధ్యక్షుడిగా సగ్గుర్తి జయరాజ్ , ఉపాధ్యక్షుడిగా బండారు రమేష్, కార్యదర్శిగా దనికొండ దుర్గారావు, కోశాధికారిగా జేమ్స్, జాయింట్ సెక్రటరీగా అబ్బూరి చిట్టిబాబు కార్యవర్గ సభ్యుడిగా మేడేపల్లి అజయ్, నూజివీడు సుధీర్, నిడికొండ శివకుమార్ ఎంపికైనట్లు అధ్యక్షుడు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం


పెదవేగి : ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం మండలంలోని నాగన్నగూడెం ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద శనివారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగల శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా కందుల రమేష్‌ను నియమించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలను అధిక సంఖ్యలో చట్టసభలకు పంపించేందుకు మహాజన సోషలిస్ట్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోస్తా ఉభయగోదావరి జిల్లా కన్వీనర్ ముమ్మిడి వరపు చిన్న సుబ్బారావు మాదిగ, ఉభయ గోదావరి జిల్లా సమన్వయకర్త బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.











ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని అన్న, వస్త్ర, వైద్య, విద్యాదాన సమాజం సంస్థ ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ దేవదాయ శాఖ జిల్లా అధికారి సీహెచ్ రంగారావు విడుదల చేశారని ఆ సంస్థ కార్యనిర్వహణాధికారి సీహెచ్‌వీ నాగ మునేశ్వరరావు తెలిపారు.







సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

దెందులూరు: అనారోగ్యానికి గురైన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శ్రీరామవరానికి చెందిన కంతేటి రవితేజ కుమారుడు చైతన్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. నేరుగా చైతన్యను భీమవరంలో సీఎంకు చూపించారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి బాలుడి చికిత్స నిమిత్తం తక్షణ సాయంగా రూ.లక్ష మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్కును శనివారం తన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి చైతన్య కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట బాబు, పెదవేగి మండల వైఎస్సార్ సీపీ నాయకులు పర్వతనేని బాబు, చైతన్య తల్లిదండ్రులు కంతేటి రవితేజ ఉన్నారు.

పోతునూరుకి చెందిన ములగల జోషిత్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని సర్పంచ్ బోదుల స్వరూప్, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీడీ ప్రసాద్ (బజ్జి), ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే జోషిత్ విషయాన్ని సీఎం జగన్‌కు వివరించడంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. 1.50 లక్షలు మంజూరయ్యాయి. శనివారం ఎల్‌ఓసీని జోషిత్ కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను ఎమ్మెల్యే కొఠారు అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, పార్టీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, మెట్లపల్లి సూరిబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ పీ. విజయ్‌బాబు, పార్టీ జిల్లా కార్యదర్శి డొమినిక్ తదితరులున్నారు.


కంతేటి రవితేజ కుమారుడు చైతన్యకు రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి

దెందులూరు: అర్హులందరూ ఓటు హక్కు పొందడానికి భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని దెందులూరు మండల ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం అన్నారు. శనివారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ ఎస్‌వీ నాంచారయ్య ఓటు హక్కుపై ప్రత్యేక స్వీప్ కార్యక్రమం, అనంతరం ర్యాలీ, అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది స్వీప్ చిత్ర పటాలను ప్రదర్శించారు.


కొవ్వలి ఉన్నత పాఠశాలలో స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి కృపావరం, తహశీల్దార్

విద్యార్థుల క్షేత్ర పర్యటన

ఉంగుటూరు: ఉప్పాకపాడు ఫౌండేషన్ ప్లస్ పాఠశాల విద్యార్థులు శనివారం పొలంబాట పట్టారు. ఉపాధ్యాయులు అల్లు శ్రీను ఆధ్వర్యంలో 4, 5 తరగతుల విద్యార్థులు పరిసరాల విజ్ఞానం సబ్జెక్ట్‌లో వ్యవసాయం పాఠ్యాంశంలో భాగంగా పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన విద్యార్థులకు వరి పంటలో వివిధ దశలను మహిళా రైతు దారపురెడ్డి అప్పన్నమ్మ వివరించారు. ఉపాధ్యాయుడు అల్లు శ్రీను మాట్లాడుతూ పిల్లలకు పాఠ్యాంశం బోధనలో భాగంగా క్షేత్ర పర్యటనకు తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు నక్కా సుధాకర్ ప్రోత్సహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా షేక్ మీరా ఉన్నీషా, విద్యార్థులు పాల్గొన్నారు.


పొలం బాటలో భాగంగా వరి నాట్లు వేస్తున్న విద్యార్థులు

నేడు మానవత సమావేశం

గణపవరం: గణపవరం మండల మానవత సర్వసభ్య సమావేశం ఈనెల 31వ తేదీ ఆదివారం ఉదయం 8.30 గంటలకు గణపవరంలో మానవత రీజియన్ చైర్మన్ కాకర్ల వినాయక ఆఫీసులో నిర్వహిస్తామని మండల మానవత అధ్యక్షుడు వంకాయల రామారావు తెలిపారు. కొత్త సంవత్సరంలో సంస్థ తరఫున చేపట్టబోయే సేవా కార్యక్రమాల అమలుపై చర్చిస్తామని తెలిపారు. సభ్యులంతా ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.































డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు అండగా వైఎస్సార్ ఆసరా

- నాల్గవ విడత నగదు పంపిణీ వేళాయె
- మండలంలో 1,449 సంఘాలకు రూ.12.62 కోట్ల లబ్ధి



పొదుపు మహిళల నుంచి బయోమెట్రిక్ స్వీకరిస్తున్న గ్రామ సంఘాల ప్రతినిధులు



భీమడోలు సచివాలయంలో లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శిస్తున్న అధికారులు

భీమడోలు: డ్వాక్రా అక్కా చెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా చివరి విడత నగదు పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మూడు విడతలుగా డ్వాక్రా రుణమాఫీ నగదును అందించి వారి కుటుంబాలు ఆర్థిక స్వావలంబనకు ఆసరాగా నిలిచింది. జనవరిలో నాల్గవ విడత వారి ఖాతాల్లో నగదు వేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనితో పొదుపు సంఘాల అక్కా చెల్లెమ్మలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహాసంకల్ప పాదయాత్రలో అక్కా చెల్లెమ్మలకు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి కరోనా వంటి కష్టకాలంలోనూ ఏటా వారి ఖాతాల్లో నగదును జమ చేసి వారికి అండగా నిలిచారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ చేస్తానని నమ్మించి గద్దె నెక్కి వారిని మోసం చేసిన విషయం డ్వాక్రా అక్కా చెల్లెమ్మలందరికీ తెలిసిందే. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి డ్వాక్రా పొదుపు మహిళలు తీసుకున్న రుణాలను ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందని జగనన్న ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఒక్కొక్క సంఘానికి లక్షల్లో లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకుని ఆ కుటుంబాలకు అన్నలా, కొడుకులా వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. జగనన్న నాలుగు విడతగా అక్కా చెల్లెమ్మలకు ఆసరా కింద నగదును వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి అమలు చేస్తున్నారు. ఇప్పటికే మూడు విడతలు నగదును అందుకున్న డ్వాక్రా పొదుపు మహిళలకు ఆఖరి విడత వారి ఖాతాల్లో నెలలో వేసేందుకు నిర్ణయించింది. సంబంధిత మండల సమాఖ్య అధికారులు అక్కా చెల్లెమ్మల నుంచి బయోమెట్రిక్‌లను స్వీకరించారు. సచివాలయాల్లో పొదుపు సంఘాల జాబితాలను సోషల్ ఆడిట్‌లో భాగంగా ప్రదర్శించారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీ పరిధిలో 1,449 డ్వాక్రా సంఘాల పరిధిలోని అక్కాచెల్లెమ్మలకు రూ.12,61,88,231 ఖాతాల్లో నగదు జమ కానుంది. సచివాలయాల్లో ఉంచిన ఆసరా లబ్ధిదారుల జాబితాల్లో ఎటువంటి అభ్యంతరాలున్నా తమ దృష్టికి తీసుకుని రావాలని ఏపీఎం పి.సురేష్‌కుమార్ తెలిపారు.

యంత్రాలతో మాసూళ్లు.. పశుగ్రాసానికి కొరత



బోగాపురంలో యంత్రంతో వరి కోత చేస్తున్న దృశ్యం

పెదవేగి : వరి మాసూళ్లలో యంత్రాల వినియోగం బాగా పెరిగింది. మాసూళ్లను కూలీలతో చేయిస్తే అవుతున్న ఖర్చు, యంత్రాలతో చేయిస్తే అయ్యే ఖర్చుతో భారీ వ్యత్యాసం ఉండటంతో రైతులను యంత్రాలవైపే మొగ్గు చూపుతున్నారు. యంత్రాలతో వరికోతలు పశు గ్రాసానికి ముప్పుగా మారాయి. యంత్రాలతో వరి కోస్తే ఆ గడ్డిని పశు గ్రాసంగా పనికిరావడం లేదు. వేసవిలో పశుగ్రాసానికి తీవ్ర కొరత ఏర్పడే పరిస్థితులు తలెత్తాయి.

50 శాతం పైగా యంత్రాలతోనే మాసూళ్లు

ఎన్నడూ లేనివిధంగా ఈ దాళ్వాలో మాసూళ్లు 50 శాతం పైగా రైతులు వరికోత యంత్రాలను ఆశ్రయించారు. పంటలను త్వరగా ఇంటికి చేర్చుకునేందుకు కూడా వీలుండటంతో యంత్రాల వైపే మొగ్గుతున్నామని రైతులు చెబుతున్నారు. వరి దుబ్బులను సగానికి పైగా వదిలివేసి యంత్రాలు కోస్తాయి. దీంతో యంత్రాలతో మాసూళ్లు చేస్తే వచ్చే ఎండుగడ్డి పరిమాణం బాగా తగ్గుతోంది. దీనికి తోడు యంత్రంతో ధాన్యం నూర్చడం వల్ల గడ్డి పూర్తిగా నలిగి బయటకు వస్తుంది. ఇది పశువులు తినడానికి పనికిరావటం లేదు. పశుగ్రాసం కొరతను రైతులు అధిగమించేందుకు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్నామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఎండుగడ్డి అయితే నిల్వ చేసుకుని వాడవచ్చని, పచ్చిరొట్ట తాత్కాలికంగా ఉపయోగపడుతుందని పశుపోషకులు వాపోతున్నారు. మండలంలో గేదెలు, ఆవులు మొత్తం 44,523 ఉన్నాయి. వరి కోతల సమయంలో యంత్రాల చక్రాల కింద పడి చెల్లా చెదురుగా బురదలో పడిపోవడంతో పశువులు ఆ గడ్డిని తినేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. రైతులు గడ్డిని చిన్న ముక్కలుగా చేసి శుభ్రపరచి అందిస్తే పశువులు తినే అవకాశం ఉంది.

కొబ్బరికి మద్దతు ధర రూ.15 వేలు ప్రకటించాలి

ఏలూరు (టూటౌన్) : క్వింటాల్ కొబ్బరికి కనీస మద్దతు ధర రూ.15 వేలు ప్రకటించాలని ఏపీ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పవరుపేటలోని అన్నె భవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ కొబ్బరికి కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాల్ మిల్లింగ్ కొబ్బరికి రూ.300, బంతి కొబ్బరికి రూ.250 పెంపుదల ఏ మాత్రం గిట్టు బాటుకాదని అన్నారు. మద్దతు ధర విషయంలో రైతులను కేంద్రం మోసగించిందని ఆరోపించారు. 2023లో మద్దతు ధర మిల్లింగ్ కొబ్బరికి క్వింటాల్ రూ.10,860 కాగా 2024లో రూ.300 మద్దతు పెంచగా రూ.11,160, బంతి కొబ్బరి క్వింటాల్‌కు రూ.11,750 కాగా 2024కు పెంచిన రూ.250తో రూ.12 వేలుగా నిర్ణయించారని తెలిపారు.

మాతా శిశు మరణాలను నియంత్రించాలి

ఏలూరు(మెట్రో) : జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో శనివారం వైద్య, ఆరోగ్య శాఖ జిల్లాస్థాయి అధికారులతో కలిసి జిల్లాలో చోటు చేసుకున్న మాతా శిశు మరణాలపై జిల్లా స్థాయి ఎండీఎస్ఆర్, సీడీఎస్ఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు చోటు చేసుకున్న శిశు మరణాల నివేదికలను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో ఇప్పటి వరకు నమోదైన మాతా శిశు మరణాలకు కారణాలను విశ్లేషించారు. ఇలాంటి మరణాలు చోటు చేసుకోకుండా భవిష్యత్తు కార్యచరణను అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ ఎస్ శర్మిష్ట, డీసీహెచ్ పాల్ సతీష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేశ్వర రావు, పలువురు వైద్య అధికారులు, విజయవాడ జీజీహెచ్, అశ్వారావుపేట ప్రాంతానికి చెందిన వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సప్తాహాల నిర్వహణ భేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమని దేవదాయ, ధర్మాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎంవీ సురేష్ బాబు అన్నారు. శనివారం ఉదయం ఆయన ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ఆయనకు వేద ఆశీర్వచనం పలుకగా దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు దుశ్శాలువాతో సత్కరించి స్వామి వారి ఫొటో, ప్రసాదాలు అందజేశారు. ఉదయం స్వామి వారికి నిత్యార్చన నిర్వహించారు.